# గౌతమీగాథలు

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

## ఇద్దరి : అద్దరి

జమీందారీ బిద్ధకం—
సాహిత్య వాసన—
సంగీత సుగంధం—

కాలం ఎంత తుడిచేసినా- వదిలిపోలేక ఎక్కడో కొంత అంటుకుని- కొన్ని గ్రామాలలో ఉంటుందనుకుంటాను.

విజయనగరం వీధుల్లో తిరుగుతున్నా పిఠాపురంలో తెరవుల్లో నడుస్తున్నా - అట్లా అనిపిస్తుంది.

పిఠాపురం సూర్యరాయాంధ్ర గ్రంథాలయంలో ఒక యేడు శరన్నవరాత్రి ఉత్సవాలు చేస్తూ - ఉపన్యాసాలు, వినోద కార్యక్రమాలు పెట్టారు.

ఒక రోజు నన్ను భాసుడి 'ప్రతిమా' నాటకంమీద మాట్లాడమన్నారు.

"నన్నయ్యయు, తిక్కన్నయు నన్నావేశించిరి" అన్నట్టు కొన్నాళ్ళనుంచి భాసుడు నన్నావేశించాడు. ఎందుకో—

అప్పటికే కాళిదాసు భవభూతి భట్టనారాయణ నాటకాలు క్షుణ్ణంగా చదివినా- ఈ భాసుడెవరో కొత్త కోణంలోంచి వచ్చి పట్టుకున్నాడు.

కళాశాలల్లో ఆ నాటకాలు పాఠం చెప్పరు. వారికి అవి ఆపోవు. డైలాగులు నాలుగైతే, శ్లోకాలు 8 ఉండే నాటకాలు ప్రచారానికి వచ్చాయి. పద్యం జమాయించి పాడేవాడే గొప్ప నటుడనే ప్రసిద్ధి వచ్చినట్టు—

ఉత్తర రామాయణ కథకు దిఙ్నాగుడు 'కుందమాల' అని పేరుపెట్టి నాటకం రాసినట్టు భాసుడు పూర్వరామాయణానికి 'ప్రతిమ' అని పేరు పెట్టడం చూస్తే వారి ఉపజ్ఞకు (ఒరిజినాలిటీ) చకితుడనై చదవడం మొదలుపెట్టాను.

గ్రంథాలయం పచ్చని పందిట్లో సభ.

కళ, సాహిత్యం, అంటే అభిమానం ఉన్నవాళ్ళంతా సభనిండా కూర్చున్నారు. తాము పెద్దగా సాహిత్యంలో మునిగి తేలక పోయినా- వారికి ఏదో నాటక ప్రీతి. సాహిత్యగంధం, నిన్న పూసుకున్న అత్తరు వాసనలా అంటుకుని ఉందేమో అనిపిస్తుంది.

ఆ గడ్డలో పుట్టి లేక పెరిగిన దేవులపల్లి సోదరులు రామకృష్ణులు, ఆధునికుల్లో వెంకట పార్వతీశ్వరులు, పానుగంటి, మొక్కపాటి, కృష్ణశాస్త్రి ప్రభృతులు తెలుగు దేశాన్ని ఒక ఊపు ఊపి విడిచి పెట్టారు.

సంగమేశ్వర శాస్త్రిగారి వీణానిక్వణంతో ఇప్పటికీ అక్కడి ఆకాశం ముఖరిత మైనట్టు అనిపిస్తుంది.

పందిట్లో వేదికవద్ద నిలబడగానే అదంతా జ్ఞాపకం వచ్చి మనస్సు వుత్సాహపూరితం అయింది. ఎదుట కూర్చున్న సన్నిహిత మిత్రుల వికసిత వదనాలు నన్ను పురిగొల్పుతున్నాయి.

"కైకేయి రాముడికీ, సీతకూ నారచీరలివ్వలేదు. వారే కోరి కట్టుకున్నారు.

సీత బంగారు లేడిని తెమ్మని కోరలేదు. పితృకార్యనిమిత్తంగా రాముడే తేవడానికి వెళ్ళాడు.

లక్ష్మణుడు అప్పుడు ఆశ్రమంలో లేనే లేడు.

భరతుడు వూరి వెలుపల దేవళంలో వేసిన తండ్రి ప్రతిమ చూచి అతని మరణం విని అక్కడినుంచే అడవికి వెళ్ళాడు.

రావణ సంహారానంతరం పుష్పకంలో తిరిగి వచ్చే రామచంద్రుణ్ణి అడవిలోనే ఎదుర్కొని కైకేయి అక్కడికి అక్కడే అతడికి పట్టాభిషేకం చేసింది.

కౌసల్య కనిపించదు; సుమిత్ర ప్రసక్తి లేదు. ఇక్కడ ఒకే ఒక 'అమ్మ' కైకేయి.

ఇదీ ప్రతిమా హృదయం; ఇదీ దాని ఉపజ్ఞ; నాటకంలో సన్నివేశ కల్పన, సంభాషణా చాతురి దాని ప్రాణాలు. అవి భాసుని సొత్తు."

ఆ ప్రసంగం సభ్యులకు నచ్చింది. డాక్టర్ సత్యనారాయణమూర్తిగారు "అది మీరు తెనిగించి ఇస్తే మేము అచ్చువేసి మిమ్మల్ని సన్మానిస్తాం" అన్నారు. ఆ మాట ఎంత హుషారు చేసినా — పెద్ద బాధ్యత మీద పడిందనుకున్నాను.

శ్రద్ధగా తెనిగించాను.

మరుసటి శరన్నవరాత్రుల ఉత్సవాలలో పుస్తకావిష్కారం. మిత్రుడు వెంకట్రావు పర్యవేక్షణంలో ప్రతిమ చక్కగా అచ్చయింది.

ఆవిష్కరణ సభకు ఎవరు అధ్యక్షులు?

ఎవరు ప్రారంభకులు?

సభా నిర్వాహకులు తర్జన భర్జనలు చేసి నా సలహామీద అధ్యక్షులుగా భమిడిపాటి కామేశ్వరరావుగారిని ప్రారంభకులుగా శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారినీ ఆహ్వానించారు.

ఆనాటి అదృష్టంవల్ల ఆ సభకు పెద్దలు వెంకటపార్వతీశ్వరులు, మొక్కపాటివారు, వారణాసివారు విచ్చేశారు.

కామేశ్వరరావుగారికి భాసుడంటే ప్రాణం. నాటకం రాయడానికే అతడు పుట్టాడంటా రాయన.

శ్రీపాదవారు భాసుని ప్రజ్ఞను గురించీ, నా రచనను గురించీ క్లుప్తంగా ముచ్చటించి ప్రారంభోపన్యాసం చేశారు. భమిడిపాటివారి కోరికమీదట — ఒక ఘట్టం — నా ఆంధ్రీకరణంలోనుంచి వినిపించాను. అంతవరకూ బాగానే వుంది.

తర్వాతే జటిల సమస్య సిద్ధమయింది.

పురప్రముఖులు సీతారామస్వామిగారిచేత సత్కార ఘట్టం నిర్వహించదలచారు నిర్వాహకులు.

వేదికమీద ఖద్దరు ధోవతులు, శాలువాలు ముగ్గురికీ ఫలపుష్పాదులతో సిద్ధం చేశారు.

అధ్యక్షులకు సన్మానం జరిగింది.

ఇక ప్రారంభకులకు. శ్రీపాదవారితో వ్యవహరించడం కత్తిమీద సాము. ఆయన ఖద్దరు ముట్టరు. రాజీ లేదు సీతారామస్వామిగారు ఖద్దరు కానిది తాకరు. అది అందరం మరిచిపోయాం.

ఖద్దరు శాలువా తీసి సమీపించగానే సుబ్రహ్మణ్యశాస్త్రిగారు- మేనక బిడ్డను కని విశ్వామిత్రుడికి చూపితే ఆయన చట్టున ముఖం పక్కకు తిప్పి కుడిచెయ్యి పైకి జెండాలా యెత్తిన రవివర్మ చిత్రంలా ఖద్దరు చూసి "ఉంచండి" అన్నారు గంభీరంగా- స్వామిగారు "ఎందుచేత" అన్నట్టు చూశారు.

నిర్వాహకులు యిరుకున పడ్డారు.

సభ స్తబ్ధమయింది.

చప్పున తట్టి నేను లేచి అన్నాను.

"శాస్త్రిగారు సరసులు అన్యథా భావించకండి.

వారు నాకిక్కడ సత్కారం వద్దు. అని నాతో చెప్పారు.

ఆ మాట నేను చెప్పడం మరచిపోయాను.

వారు వేరొక సందర్భంలో స్వీకరిస్తారు అది నాకు విడిచిపెట్టండి" అన్నాను.

సభ్యులు కిలకిల నవ్వారు.

భమిడిపాటివారు భేష్ అన్నారు.

అందరికీ అప్పటి ఆంతర్యం తెలుసు.

సభ కులాసాగా ముగిసింది.

శాస్త్రిగారిని ప్రసన్నులను చేసుకుని మనసారా నన్ని చేనేత వస్త్రాలతో సన్మానించాము.